క్లుప్తంగా

రేపు నవోదయ మోడల్ టెస్ట్

రామగిరి(నల్లగొండ) : జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఈ నెల 26న ఉదయం 10 గంటలకు నల్లగొండ పట్టణంలోని శేఖర్ ఇన్‌స్టిట్యూట్‌లో మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 955337211 సెల్ నంబర్‌లో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

28న మున్సిపల్ సమావేశం

నకిరేకల్ : మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలాజీ తెలిపారు. పాలకవర్గ సభ్యులందరు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సీపీఐ నాయకుడు మృతి

మునుగోడు : మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు సూర నర్సింహ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను సందర్శించి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ, బి. లాలు, మల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, యాదయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీఓకు వినతి

మర్రిగూడ : ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత ఖాతాలో జమఅయిన వాటికి మాత్రమే ఐటీ వర్తింపజేయాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ మండల నాయకులు శుక్రవారం నాంపల్లి ఎస్‌టీఓ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శులు గ్యార నరసింహ, కసిరెడ్డి కృష్ణారెడ్డి, ఎస్.నారాయణ, కె.శ్రీనయ్య, బి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ



ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రింటర్, స్కానర్‌ను పూర్వ విద్యార్థులు శుక్రవారం హెచ్‌ఎం జానకికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ రాచమల్ల శ్యాంసుందర్, నర్రా భిక్షంరెడ్డి, బూరుగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ అందజేత



స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

మునుగోడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9,10 తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థులకు నెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్పవల్లి స్కాలర్ షిప్‌లను శుక్రవారం అందించారు. ఆ పాఠశాల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 3వేల చొప్పున స్కాలర్‌షిప్‌ను పాఠశాల హెచ్‌ఎం ఎస్. యాదయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లి ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ శనివారం పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వల్లాలలోని శ్రీపార్వతి శంభు లింగేశ్వర బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ముఖ్య ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

గడువు పొడిగింపు

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు మార్చి 1 వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ శివస్వరూపరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7–10వ తరగతిలో ఖాళీ సీట్లకు ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

నార్కట్‌పల్లి : తొండల్‌వాయి గ్రామంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు తాపించే కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. పశువైద్యాధికారి రవి నాయక్, ఉప సర్పంచ్ చింత సుధాకర్, చిన్ననారాయణపురం సర్పంచ్ కొత్త నర్సింహ, గొర్రెల, మేకల సహకార సంఘం అధ్యక్షుడు దా స రి భూపాల్, భవాని, సుజాత, రమేష్, ఉన్నారు.



నట్టల నివారణ మందు తాపిస్తున్న ఎంపీపీ

కుక్కలున్నాయి.. జాగ్రత్త !

నల్లగొండ పట్టణంలో వీధికుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది. కాలనీలు, మెయిన్‌రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ వాహనదారులను, పాదచారులను, విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. చిన్నారులు వీధుల్లో వెళ్లాలంటే భయపడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వీధి కుక్కలను పట్టణం నుంచి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ



నల్లగొండ పట్టణం ప్రకాశం బజార్‌లోని వీధిలో సంచరిస్తున్న కుక్క



శ్రీనివాసనగర్ కాలనీ గల్లీలో భయంగా పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



హనుమాన్‌నగర్ రోడ్డులో..



నల్లగొండ పట్టణంలోని రవీంద్రనగర్‌లో ..



ప్రకాశం బజార్‌లో..





నల్లగొండ పట్టణంలోని రవీంద్రనగర్‌లో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు



హైదరాబాద్ రోడ్డులో..

ప్రజారోగ్యమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయం



కట్టంగూర్ : శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి

కట్టంగూర్ : ప్రజారోగ్యమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 15వ ఫైనాన్స్ నిధులు రూ.1.56 కోట్లతో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణానికి వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గర్భిణులకు మండలకేంద్రాల్లో పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహకారంతో నకిరేకల్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.32 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లోకసాని వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ దేశ్యా నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చలపతి, వైద్యాధికారి శ్వేత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గుర్రం సైదులు, టీ. భవాని, ఎడ్ల పురుషోత్తంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, మండల కోఆప్షన్ సభ్యుడు జానీపాష, కక్కిరేణి వెంకటేశ్వర్లు, పెద్ది బాలనర్సింహ, అంతటి శ్రీను, నాగరాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

చిట్యాల : ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు పేద ప్రజలకు తక్కువ ధరలో మెరుగైన వైద్య సేవలు అందించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. మలక్‌పేట యశోద హాస్పిటల్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చిట్యాలలో ఏర్పాటు చేసిన రెండు ఉచిత అంబులెన్స్ సర్వీస్‌లను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ గోరుకంటి పవన్ మాట్లాడుతూ అధునాతన వెంటిలెటర్స్, ఆక్సిజన్ సౌకర్యం కలిగిన రెండు అంబులెన్స్ సర్వీస్‌లు చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి, కట్టంగూర్‌లలో హైవే రోడ్డుపై అందుబాటులో ఉంటాయని తెలిపారు. అవసరమైన వారు 105910 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, సీఐ కే.శివరాంరెడ్డి, ఎస్‌ఐ ధర్మా, మలక్‌పేట యశోద హాస్పిటల్ యూనిట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు చేరవేయాలి



నకిరేకల్ : మాట్లాడుతున్న పోతెపాక సాంబయ్య

నకిరేకల్ : కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను కార్యకర్తలు బూత్ స్థాయిలో ప్రజలకు చేరవేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య కోరారు. నకిరేకల్ మండలం గోరెంకలపల్లిలో శుక్రవారం ప్రజాగోస– బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్ కొండేటి శ్రీను, మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి, మండల వెంకన్న, గుడుగుంట్ల సాయన్న, బుడిగె సైదులు, పసూనూరి సైదులు, చెనగాని రాములు, వలిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి

మర్రిగూడ : రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని కొట్టాల గ్రామశక్తి కేంద్రం పరిధిలో నిర్వహించిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వీధిలైట్ల నుంచి శ్మశానవాటికల వరకు కేంద్ర ప్రభుత్వమే నిధులను కేటాయిస్తుంటే.. ఆ నిధులు తమవేనని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోవడం బీఆర్‌ఎస్‌కే చెల్లుతుందన్నారు. బీజేపీ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి యాస అమరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, సర్పంచ్‌లు గంటా కవితయాదయ్య, జంగిలి లక్ష్మీప్రసన్నరవి పాల్గొన్నారు.

మిగిలిన ఆహారం బయట పడేయొద్దు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలోని హోటల్స్, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టల్స్ నిర్వాహకులు మిగిలిపోయిన ఆహారాన్ని బయట పడేయొద్దని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆహారాన్ని మురుగు కాల్వల్లో, వీధి కుక్కలకు, పందులకు వేస్తున్నారని, ఇలా చేయడం ద్వారా ఆహారం వేయని సమయంలో కుక్కలు రోడ్లపై మనుషులను కరిచే అవకాశం ఉందన్నారు. మిగిలిన ఆహారాన్ని గుంత తీసి అందులో వేయడం ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేసుకొని మొక్కలకు ఎరువుగా వాడుకోవచ్చని అన్నారు. కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కంప్యూటర్ ఆపరేటర్ లేక వినియోగదారుల అవస్థలు



విద్యుత్ ఏడీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వినియోగదారులు

మునుగోడు : మండల కేంద్రంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినియోగదారులు సేవా కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ఆ సర్వీస్ కేంద్రం ద్వారా నూతనంగా కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు మీటర్లు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, కొత్తగా వ్యవసాయ మోటార్ల కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కంప్యూటర్ ఆపరేటర్‌కు దరఖాస్తుతోపాటు డీడీ అందిస్తే ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేస్తారు. ఆపరేపటర్ అప్‌లోడ్ చేసిన తరువాతే అధికారులు నూతన కనెక్షన్ మంజూరు చేస్తారు. అయితే కంప్యూటర్ ఆపరేటర్ ఏడు నెలలుగా లేకపోవడంతో అధికారులు చండూరు ఏఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆపరేటర్‌తో వారంలో ఒకటి, రెండు రోజులు నమోదు చేయిస్తున్నారు. ఏడాది క్రితం వరకు ఇక్కడ పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్ చండూరుకు బదిలీ కాగా, నల్లగొండ నుంచి మరొక ఆపరేటర్ ఇక్కడికి వచ్చారు. అయితే ఆయన విధుల్లో చేరిన నాలుగు నెలలకు మరొక ఉద్యోగం రావడంతో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జ్ ఆపరేటర్‌తో పనులు కొనసాగిస్తున్నారు. ఆపరేటర్ ప్రతిరోజు కార్యాలయంలో ఉండకపోవడంతోపాటు ఎప్పుడు వస్తాడో తెలియక వినియోగదారులు నిత్యం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని నూతన కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని వినియోగదారులు కోరుతున్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు



మాడ్గులపల్లిలో విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రామగిరి(నల్లగొండ) : చిన్నారుల్లో అయోడిన్ లోపాలను గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా శుక్రవారం అయోడిన్ సర్వే (నేషనల్ అయోడిన్ డెఫిషియెన్సీ డిజార్డర్ ప్రివెన్షన్ ప్రోగ్రాం) నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మాడ్గులపల్లిలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల 45 మంది బాలికలు, 45 బాలు రకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఇంటి నుంచి తీసుకొచ్చిన ఉప్పుతోపాటు వారి యూరిన్ నమూనా సేకరించి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎం.ప్రదీప్‌బాబు, ఎన్.శ్రీనివాస్, ఎం.ఆర్.చారి తదితరులు పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 6 నుంచి 12 ఏళ్లలోపు 45 మంది బాలికలకు, 45 మంది బాలురకు వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 18 మందికి అయోడిన్ లోపం ఉందని, 9 మందికి యూరిన్, అయోడిన్ లోపాలు ఉన్నాయనే అనుమానంతో నిర్ధారణకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపించినట్లు వైద్యాధికారి రాజు తెలిపారు. వైద్య పరీక్షల ఫలితాలు రాగానే విద్యార్థులకు ఉచితంగా మందులు, వైద్యం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, ఏఎన్‌ఎంలు ప్రేమలత, కవిత, ముబీనా, ఆశ వర్కర్లు వేదవతి, కర్నాటి లక్ష్మి, ఇడెం లలిత, రాణి ఉన్నారు.

ఎమ్మెల్యే హావభావాలతో..



ఎమ్మెల్యే గెటప్‌లో బాలుడు శ్రీపాదశర్మ

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా ఓ బాలుడు నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి వేశధారణలో ఆకట్టుకున్నాడు. బాలుడు పోగుల కొండ శ్రీపాదశర్మ కారులో ఎమ్మెల్యే వేశధారణలో పాఠశాలకు వెళ్లగా అక్కడ గన్‌మెన్లుగా వ్యవహరించిన తోటి విద్యార్థులు కారు డోర్ తీయడంతో కిందకు దిగాడు. చేయి ఊపుకుంటూ పాఠశాల లోపలికి వెళ్లగా విద్యార్థులు, ఉపాధ్యాయులు లేచి నిలబడి నమస్కరించారు. విద్యార్థి వేశధారణ, హావభావాలు ఆకట్టుకున్నాయి.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మర్రిగూడ : ఆరోగ్యశ్రీ పథకంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్యమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక పలువురు ఆరోగ్యమిత్రలు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదన్నారు. ఆరోగ్యశ్రీతోపాటు ఈహెచ్‌ఎస్, ఆయుష్మాన్ భారత్, ఈ కేవైసీ వంటి అదనపు పనులు కూడా చేయించడం బాధాకరమన్నారు. ఆరోగ్య మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

పదకొండు గంటలైనా.. పత్తాలేని అధికారులు !



కార్యాలయ సమయంలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గది



ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది గది..

శాలిగౌరారం : మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు శుక్రవారం పదకొండు గంటల వరకు సిబ్బంది విధులకు హాజరుకాలేదు. ఒకరిద్దరు కిందిస్థాయి సిబ్బంది మినహా మరే ఇతర సిబ్బందితోపాటూ మండల ప్రధాన అధికారులు సైతం సకాలంలో విధులకు హాజరుకాలేదు. వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోని చెట్లకిందనే అధికారుల రాకకోసం పడిగాపులుకాశారు. అధికారులు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ కార్యాలయాలకు పనులకోసం వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ×సాక్షి¸మండల అధికారులతో ఫోన్‌లో మాట్లాడగా విధి నిర్వహణలో భాగంగానే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లామని తెలిపారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి



వరి చేలను పరిశీలిస్తున్న ఏఓ పురుషోత్తం

కేతేపల్లి : వరి సాగులో రైతులు ఎప్పటికప్పుడు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేతేపల్లి ఏఓ బి.పురుషోత్తం సూచించారు. మండలంలోని గుడివాడ గ్రామంలో యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పొలాలను గురువారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పొలంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వరిలో అగ్గి తెగులు, పొడ తెగులు, కాండం తొలుచు పురుగుల ఆశించినట్లుగా గుర్తించామని అన్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సి సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వీరేష్, రైతులు రాచకొండ యాదగిరి, ఆలకుంట్ల అంజయ్య, జానయ్య పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల శాంతియాత్ర



శాంతియాత్రను ప్రారంభిస్తున్న బీకే ధనలక్ష్మి

నల్లగొండ టౌన్ : పట్టణంలోని శాంతినగర్‌లో శుక్రవారం నిర్వహించిన బ్రహ్మకుమారీల శాంతియాత్రను బీకే ధనలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజలంతా శాంతియుతంగా మెలగాలని కోరారు. యాత్ర లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాల, పాఠశాల మీదుగా జైల్‌ఖానా సమీపం నుంచి దేవరకొండ రోడ్డు మీదుగా శాంతినగర్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో బీకే భద్రయ్య, గాదె వినోద్‌రెడ్డి, ఎన్‌వీ రఘువీర్‌ప్రతాప్, వీరేశం, వెంకటేశం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలి

కేతేపల్లి : ఇప్పలగూడెం శివారులోని గోదాంలో గోనె సంచులు కాలిపోయిన ఘటనలో రాజకీయ కుట్ర కోణం ఉన్నట్లు అనుమానాలున్నాయని, ప్రమాదంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరెంటు సౌకర్యం లేని గోదాంలో షార్ట్ సర్క్యూట్ జరిగే అస్కారమే లేదని, గోదాంలోకి నిప్పు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. సమావేశంలో కేతేపల్లి ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, నాయకులు జి.రవీందర్‌రెడ్డి, కప్పల సైదులు, ముద్దం విజయ్, ఎండీ.యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

చిట్యాల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేయాలని చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ పరిధిలోని కాంప్లెక్స్ హెచ్‌ఎం గోగికార్ మాధవి అన్నారు. శుక్రవారం చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంల, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కాంప్లెక్స్ హెచ్‌ఎంగా విధుల్లో చేరిన మాధవిని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సన్మానించారు.

బీపీ, షుగర్ కిట్ల పంపిణీ



మందులు అందజేస్తున్న సర్పంచ్ సత్యం

మునుగోడు : రాష్ట్రంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే సీఎం కేసీఆర్ ప్రధాన లక్ష్యమని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గుర్రం సత్యం అన్నారు. ప్రభుత్వం బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అందిస్తున్న మందుల కిట్లను శుక్రవారం ఆయన రావిగూడెం గ్రామంలో పంపిణీ చేసి మాట్లాడారు. సూపర్‌వైజర్ రమాదేవి, ఏఎన్‌ఎం ధనమ్మ, లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వల్లాలలో సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో గల శ్రీశాంభవి శంభులింగేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ పూజారులు వావిలాల వేణునాథశర్మ, రామలింగయ్యశర్మ నేతృత్వంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 18న ప్రారంభమైన ఆలయ బ్రహ్మోత్సవాలు 26న ముగియనున్నాయి.

ఉపాధి హామీ పనులపై కూలీలకు అవగాహన

మునుగోడు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జానయ్య కోరారు. శుక్రవారం మండలంలోని గుండ్లోరిగూడెం గ్రామంలో కూలీలకు, రైతులకు ఉపాధి హామీ పథకం పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనులు చేస్తే ప్రతి కూలీకి రోజుకు రూ. 230 చొప్పున వేతనం వస్తుందన్నారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనయ్య, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ టూటౌన్ : వీధి కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెప్మా సీఓ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 38వ వార్డు హనుమాన్‌నగర్‌లో కాలనీవాసులకు వీధి కుక్కలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఒక్కరు కాకుండా గుంపుగా వెళ్లాలని సూచించారు. మాంసం దుకాణాల నిర్వాహకులు వ్యర్థ పదార్థాలను రోడ్ల వెంట వేయొద్దని కోరారు. కుక్కల గుంపులు కనిపిస్తే మున్సిపాలిటీ టోల్‌ఫ్రీ నంబర్ 14420, లేదా 08682–220100 నంబర్‌లకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు నాగలక్ష్మి, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడి విగ్రహం ఆవిష్కరణ

నల్లగొండ టౌన్ : లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాలని పీబీడీ లయన్ సునిల్‌కుమార్ రుమల్లా అన్నారు. లయన్ భవన్‌లో లయన్స్ క్లబ్ నల్లగొండ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన రెండో అంతస్తును శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం భవనంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్‌జోన్స్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. లయన్స్ క్లబ్ భవనం నిర్మాణానికి సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. జగిని భీమయ్య, డాక్టర్ బాబురావ్ గట్టమనేని, తీగల మోహన్‌రావు, వి.శివప్రసాద్, గోలి అమరేందర్‌రెడ్డి, నేతి రఘుపతి, కేవీ ప్రసాద్, బి.దయాకర్, జి.లింగయ్య, కె.సతీష్‌కుమార్, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, చిలుకూరి రామకృష్ణ పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం

శాలిగౌరారం : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భైరవునిబండ సర్పంచ్ దండ రేణుకఅశోక్‌రెడ్డి అన్నారు. గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని మండల వైద్యాధికారి వెంకన్నతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కంటి వెలుగు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదతరులు పాల్గొన్నారు.